


# కరపత్రం

SINCE 2014

ఆదివారం అక్టోబర్ 20 2024 | సంపుటి :0 | సంచిక : 12 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు: 4

# కేసీఆర్ కుటుంబానిది దోపిడీ చరిత్ర: రేవంత్‌రెడ్డి




- నాలాలు, చెరువులను ఆక్రమించుకున్న వారే హైడ్రాను చూసి భయపడుతున్నారని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.
- చార్మినార్ వద్ద నిర్వహించిన రాజీవ్‌గాంధీ సద్భావనా యాత్ర స్మారక దినోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు.
- "హైడ్రాను చూసి రియల్ ఎస్టేట్‌ను దెబ్బతీయాలని కొంతమంది చూస్తున్నారు.

అజీజ్‌నగర్‌లో హరీశ్‌రావుకు ఫాంహౌస్ లేదా? గతంలో కాంగ్రెస్ వల్లనే హరీశ్‌రావుకు మంత్రి పదవి వచ్చింది. కేసీఆర్ కుటుంబానికి దోపిడీ చరిత్ర ఉంది. తెలంగాణ ఆర్థిక మూలాలు దెబ్బతీయాలని చూస్తున్నారు " అని రేవంత్‌రెడ్డి విమర్శించారు.

ఈ సందర్భంగా మాజీ మంత్రి గీతారెడ్డికి సద్భావనా అవార్డును సీఎం ప్రదానం చేశారు. గీతారెడ్డికి ఈ అవార్డు రావడం సంతోషంగా ఉందని ఆయన పేర్కొన్నారు.

"దేశ సమగ్రత కోసం 34 ఏళ్ల క్రితం రాజీవ్ గాంధీ సద్భావన యాత్ర చేపట్టారు. ఏటా వారి స్ఫూర్తిని కొనసాగిస్తూ ముందుకు వెళ్తున్నాం. సుదీర్ఘ కాలం ప్రజలకు సేవలందించిన గీతారెడ్డిని సద్భావన అవార్డుకు ఎంపిక చేయడం అభినందనీయం. రాజకీయాల్లో పదవుల కోసం పాకులాడే వారిని చూశాం. కానీ 2023 ఎన్నికల్లో పోటీ చేయనని చెప్పిన గొప్ప వ్యక్తి గీతారెడ్డి. గాంధీ కుటుంబం తీసుకున్న నిర్ణయాలతోనే కాంగ్రెస్ హయాంలో దేశంలో పేదలకు మేలు జరిగింది. ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ దేశం కోసం ప్రాణాలు అర్పించారు. ప్రధాని పదవులను త్యాగం చేసిన ఘనత సోనియా, రాహుల్‌ది.

పేజి 2లో

## రేవంత్ సర్కార్‌కు బండి అండ



- ప్రభుత్వాన్ని కాపాడేందుకు తంటాలు
- ట్విట్టర్ వేదికగా కేటీఆర్ విమర్శలు
- మద్యం ధరలపై ధ్యా తప్పు రేవంత్‌కు మరోటి లేదని ఎద్దేవా

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఉద్దేశిస్తూ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. రేవంత్ రెడ్డి సీఎం కుర్చీని కాపాడేందుకు బండి సంజయ్ తాపత్రయ పడుతున్నారంటూ ట్విటర్ వేదికగా కేటీఆర్ విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో ఉన్నది కాంగ్రెస్ ప్రభుత్వమా? లేక బీజేపీ అనుబంధ ప్రభుత్వమా? అంటూ కేటీఆర్ ప్రశ్నలు సంధించారు. ముఖ్యమంత్రి సీటు నుంచి రేవంత్ రెడ్డిని దించేందుకు కాంగ్రెస్ మంత్రులే కుట్రలు చేస్తున్నారని బండి సంజయ్ అన్నారు.

## కేటీఆర్.. ఎక్కువగా అరవకు

2 లో

- కాంగ్రెస్, మీరు ఇద్దరూ ఒక్కటే
- ఫోన్ ట్యాపింగ్‌లో మ్యా ఫిక్సింగా నిజామా కాదా?
- గట్టిగా హెచ్చరించిన బండి సంజయ్

## ప్రతి నియోజకవర్గానికి 3,500 నుంచి 4 వేల ఇందిరమ్మ ఇళ్లు: మంత్రి పొంగులేటి



హైదరాబాద్: ఇందిరమ్మ ఇళ్లపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కీలక ప్రకటన చేశారు. ఈ నెలాఖరులోగా మొదటి విడతలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. ప్రతి నియోజకవర్గానికి 3,500 నుంచి 4,000 గృహాలు మంజూరు చేయనున్నట్లు చెప్పారు. రానున్న నాలుగేళ్లలో 20 లక్షల ఇందిరమ్మ ఇళ్లు నిర్మించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. పార్టీలకు సంబంధం లేకుండా పేదలకు అందజేస్తామని తెలిపారు.

## నివేదిక తర్వాతే..

### రైతు భరోసా పథకం అమలు : మంత్రి

తెలంగాణ మంత్రివర్గ ఉపసంఘం నివేదిక వచ్చిన తర్వాత రాబోయే సీజన్ నుంచి రైతుభరోసా పథకం అమలు చేస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.



2 లో

హైదరాబాద్ : తెలంగాణ మంత్రివర్గ ఉపసంఘం నివేదిక వచ్చిన తర్వాత రాబోయే సీజన్ నుంచి రైతుభరోసా పథకం అమలు చేస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. హైదరాబాద్ బీఆర్కేఆర్ భవన్‌లో జరిగిన మీడియా

## పోలీసుల అదుపులో బండి సంజయ్.. చలో సచివాలయం ర్యాలీ ఉద్రిక్తం

గ్రూప్-1 పరీక్షల నిర్వహణపై ప్రభుత్వం పునరాలోచన చేయాలని డిమాండ్ చేస్తూ కేంద్ర మంత్రి బండి సంజయ్ విద్యార్థులతో కలిసి చేపట్టిన చలో సచివాలయం ర్యాలీ ఉద్రిక్తంగా మారింది.

2 లో



## కివీస్‌పై సెంచరీ.. దిగ్గజాల సరసన సర్ఫరాజ్

- తొలి ఇన్నింగ్స్‌లో డకౌట్‌గా వెనుదిరిగిన సర్ఫరాజ్.. రెండో ఇన్నింగ్స్‌లో సెంచరీ బాదాడు.
- ఈ నేపథ్యంలో ఓ అరుదైన క్లబ్‌లో దిగ్గజ ఆటగాళ్ల సరసన చేరాడు.



2 లో

ఇంటర్నెట్ డెస్క్: బెంగళూరు వేదికగా న్యూజిలాండ్‌తో జరుగుతున్న తొలి టెస్ట్ రెండో ఇన్నింగ్స్‌లో భారత యువ బ్యాటర్ సర్ఫరాజ్ ఖాన్ సెంచరీ చేసిన విషయం తెలిసిందే. కాగా నాలుగో టెస్ట్‌లోనే తొలి శతకం నమోదు చేశాడు. కేవలం 110 బంతుల్లోనే సెంచరీ పూర్తి చేశాడు. తొలి ఇన్నింగ్స్‌లో డకౌట్‌గా వెనుదిరిగిన సర్ఫరాజ్.. రెండో ఇన్నింగ్స్‌లో సెంచరీ బాదాడు. ఈ నేపథ్యంలో ఓ అరుదైన క్లబ్‌లో దిగ్గజ ఆటగాళ్ల సరసన చేరాడు.ఒకే టెస్ట్‌లో, తొలి ఇన్నింగ్స్‌లో డకౌట్ అయి.. రెండో ఇన్నింగ్స్‌లో సెంచరీ చేసిన భారత ఆటగాళ్ల జాబితాలో సర్ఫరాజ్ తొమ్మిదో ఆటగాడిగా నిలిచాడు.

# తేలిపోయిన రాహుల్ గాంధీ రాజ్యాంగ ప్రదర్శన

## మాటల కంటే చేతలే ఎక్కువ మాట్లాడుతున్నాయి

శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్

సండే వ్యాసం..రాహుల్ గాంధీ రాజ్యాంగం చేత్తో పట్టుకుని గంభీరంగా ఉపన్యాసాలు దంచడం రాజ్యాంగ రక్షణ కాలేదు. అదేదో చేతల్లో చూపించాలి, నిరూపించుకోవాలి. కానీ కాంగ్రెస్ పార్టీ ఇంటా బయటా చేస్తున్నది అది కాదు. ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ అధ్యక్షుడు శామ్ పిత్రోడా సమక్షంలో ఇండియా టుడే జర్నలిస్ట్ రోహిత్ శర్మ మీద అమెరికాలో జరిగిన దాడిని ఏమనాలి? సిక్కులకు భారతదేశంలో గురుద్వారాలకు వెళ్లే స్వేచ్ఛ, తలపాగా ధరించి తిరిగే స్వేచ్ఛ, కడ (కడియం) ధరించే హక్కు ఏవీ?అంటూ కాంగ్రెస్ నాయకుడు, లోక్‌సభలో విపక్షనేత రాహుల్ గాంధీ ప్రశ్నించారు. ఆ ప్రశ్నలు ఎంత అసంబద్ధమో మొత్తం ప్రపంచం వెంటనే గుర్తించింది. అది వేరే సంగతి. భారత్‌లో సిక్కుల స్వేచ్ఛ గురించి ప్రస్తావించడానికి రాహుల్‌కు స్వేచ్ఛ ఉంటే, బాంగ్లాదేశ్‌లో హిందువుల దుస్థితి గురించి విపక్షనేత ఏం చెబుతారు అని అడిగే స్వేచ్ఛ ఒక జర్నలిస్టుకు ఎందుకు ఉండదు? సిక్కులు భారతదేశంలో మైనారిటీలు. బాంగ్లాదేశ్‌లో హిందువులు మైనారిటీలు. ద్వితీయ శ్రేణి పౌరులకంటే అధ్వాన జీవితం గడుపుతున్న వారు బాంగ్లాదేశ్ హిందువులే. ఇక్కడ సిక్కులు గౌరవప్రదంగా



జీవిస్తున్నారు.

హిందువులంటే కాంగ్రెస్‌కు మొదటి నుంచి ద్వేషమే. చిన్నచూపే. రాహుల్ నాయకత్వంలోని కాంగ్రెస్ ఈ విధానానికి ఇంకాస్త సొబగులు అద్దుకుంది. అయితే, సిక్కుల మీద రాహుల్‌కీ, కాంగ్రెస్‌కీ ఎందుకీ అకాల ప్రేమ? ఇటీవలి పర్యటన వేళ అమెరికాలో తెరిచిన ప్రేమ దుకాణం ద్వారా రాహుల్ గాంధీ ఉచితంగా అందించిన సిక్కు ప్రేమ వెనుక ఉన్నది అధికార లాలస. భారత ప్రధాని పీఠానికి గాంధీ - నెహ్రూ వారసులు తప్ప అన్యులు అనర్హులు అన్న అహంభావం.

రాహుల్ లోక్‌సభలో విపక్షనేత అయిన తరువాత మొదటిసారి జరిపిన తాజా అమెరికా యాత్ర గత యాత్రల కంటే ఎక్కువ వివాదమే రేపింది. విపక్షనేత దేశ వ్యతిరేకి అన్న విమర్శను కట్టబెట్టింది. ఇందుకు కారణం ఇండియా టుడే జర్నలిస్టు మీద జరిగిన దాడి మాత్రమే కాదు. సిక్కులు కూడా మైనారిటీలే అన్న విషయం హఠాత్తుగా ఆయనకు గుర్తుకు రావడం కూడా. భారత్‌లో మైనారిటీలకు హక్కులు ఉండవు అంటూ అమెరికా సహా, ఇతర విదేశీ పర్యటనలలో ఇంతకాలం ప్రచారం చేసిన రాహుల్ ఇప్పుడు తన వాచాలతని సిక్కుల కోసం కేటాయించారు. ఆ మాటలేవీ సాధారణ సిక్కుల జీవితం గురించి చెప్పినవి కావు. వేర్పాటువాదాన్ని అంటకాగుతున్న ఖలిస్తాన్ ప్రేమికులకు అనుకూలించేవి. అందుకే రాహుల్ పర్యటన ఇంత వివాదాస్పదంగా మారింది. ఆయన నిప్పుతో చెలగాటమాడుతున్న సంగతి స్పష్టమైంది. వాషింగ్టన్ డీసీలో రాహుల్ అన్న మాటలు భారతదేశాన్ని దిగ్భ్రాంతికి గురి చేశాయి. ఇప్పుడు పోరాటమంతా సిక్కులకు తలపాగా ధరించే హక్కు గురించి, కడియం ధరించే హక్కు గురించి అంటూ ఆయన వదరడం ముమ్మాటికీ బాధ్యతారాహిత్యం. ఇది తన ఒక్కడి పోరాటం మాత్రమే కాదట, అన్ని మతాలదీనట. రిజర్వేషన్లు ఎత్తివేస్తామని మొదట నోరు జారి, ఆపై అసలు 50 శాతం పరిమితి ఎత్తివేయాలన్నదే తన అంతరంగమని నాలుక మడత వేసిన రాహుల్, సిక్కుల స్వేచ్ఛ గురించి అవాకులూ చెవాకులూ పేలి దేశ వ్యతిరేక శక్తులకు బలం చేకూర్చారు. రైతు ఉద్యమాల పేరుతో మళ్లీ దేశంలో చొరబడిన ఖలిస్తానీ శక్తులకు కాంగ్రెస్ ప్రేమ దుకాణంలో ఉచితంగా లభించిన ఊతమే ఈ వాగుడు. భారత్‌లో సిక్కుల ఉనికికే ప్రమాదం ఏర్పడిరదన్న రీతిలో రాహుల్ చేసిన వ్యాఖ్యలు అమెరికా-కెనడాలలో ఉండి పన్నాగాల మీద పన్నాగాలు పన్నే గురు పత్వంత్ సింగ్ పన్నున్ వంటి వాళ్లకి కొత్త ఉత్సాహాన్ని ఇచ్చాయి. సిక్కుల రాజ్యంగా పంజాబ్‌కు స్వాతంత్ర్యం కావాలన్న సిక్స్ ఫర్ జస్టిస్ (పన్నున్ నాయకత్వంలోని సంస్థ) డిమాండ్‌కు రాహుల్ మద్దతు ఇచ్చారంటూ పన్నున్ ప్రకటించడం ఇందుకు నిదర్శనం. ఇతడికి నచ్చే వాదనలు, ఈ వేర్పాటువాదికి అనుకూలించే సూత్రీకరణలు విపక్షనేత చేయడం ఎంత దౌర్భాగ్యం! తన మూర త్వంతోనే కావచ్చు. లేదా తైనాతీలు కల్పిస్తున్న భ్రమలతో కావచ్చు. లేదా గాంధీ-నెహ్రూ కుటుంబంలోని సహజ పదవీదాహంతో కావచ్చు. రాహుల్, ఆయన తైనాతీలు చరిత్ర పునరావృతం కావడానికి శతథా దోహదపడుతున్నారు. ఏ కోణం నుంచి చూసినా ఖలిస్తానీవాదుల చేతిలో అక్టోబర్ 31, 1984న జరిగిన ఇందిర హత్య నేపథ్యాన్ని పదే పదే గుర్తుకు తెస్తున్నారు.

2 లో

కరపత్రం
తెలుగు దిన పత్రిక
ఆదివారం అక్టోబర్ 20 2024

# మూసీ పేరుతో ప్రజాధనాన్ని లూటీ చేసే యత్నం

మొదటి పేజీ తరువాయి

మూసీపై రూ.10 వేల కోట్లతో భారీ స్కై ఓవర్ నిర్మించాలనుకున్నామని తెలిపారు. ఎంత శుద్ధి చేసినా మూసీ నీళ్లు తాగేవి కాదని చెప్పారు. అందువల్ల కొండపోచమ్మ సాగర్ నుంచి మూసీకి నీళ్లు తేవాలని నిర్ణయించామన్నారు. గోదావరి నుంచి నీళ్లు తెచ్చేందుకు రూ.1100 కోట్లతో ప్రణాళిక రూపొందించామని తెలిపారు. ఆ ప్రాజెక్టుకు గతేడాది మే 18న శంకుస్థాపన చేశామని గుర్తుచేశారు. మూసీ పేరుతో ప్రజాధనాన్ని లూటీ చేసేందుకు రేవంత్ రెడ్డి ఎ÷-లాన్ వేశారని చెప్పారు. రూ.26 వేల కోట్లతో మొత్తం మూసీ పునరుజ్జీవం అవుతుందని, కానీ రేవంత్ రెడ్డి మాత్రం లక్షన్నర కోట్లు ఖర్చు చేస్తామని చెబుతున్నారని విమర్శించారు. ఢిల్లీలో కాంగ్రెస్‌కు మూటలు మోయడానికి రేవంత్ రెడ్డి దొరికాడని చెప్పారు. హైడ్రా పేరుతో బిల్డర్లను బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. మూసీ బఫర్ జోన్‌లో ఉన్నవాళ్లను కబ్జాదారులని రేవంత్ ముద్ర వేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి తనను మూసీ వద్ద 3 నెలలు ఉండాలని అంటున్నడు.. 60-70 ఏండ్ల నుంచి ప్రజలు ఇక్కడే ఉంటున్నారని తెలుసుకోవాలన్నారు. మూసీ పక్కన తాను మూడు నెలలు కాదు మూడేండ్లు ఉంటానని స్పష్టం చేశారు. మూసీ తనకు చిన్నప్పటి నుంచి తెలుసని, కొత్తగా రేవంత్ చెప్పాల్సింది లేదన్నారు. సోకుల కోసం పేదలను రోడ్డున పడేయొద్దని ముఖ్యమంత్రికి సూచించారు. రేవంత్ తన కుర్చీ కాపాడుకోవడానికి కావాలంటే చందాలిస్తామన్నారు. 2400 కిలోమీటర్ల పొడవైన నమామి గంగే ప్రాజెక్టు కోసం ప్రధాని మోదీ రూ.40 వేల కోట్లు ఖర్చు చేశారని, మూసీ కోసం రేవంత్ కిలోమీటర్‌కు రూ.2700 కోట్లు ఖర్చు చేస్తున్నారని విమర్శించారు. మూసీకి రెండువైపుల రిటెయినింగ్ వాల్ కట్టాలని సూచించారు. మూసీ మీద ఎక్స్‌ప్రెస్ వే నిర్మించాలని చెప్పారు. అంతకంటే కొత్తగా రేవంత్ రెడ్డి చేయాల్సిందేమీ లేదన్నారు. మూసీ బాధితులకు తామంతా అండగా నిలబడతామని చెప్పారు. మూసీ ప్రాజెక్టుకు డీపీఆర్ లేకుండానే ఇం÷-లడెందుకు కూలగొడుతున్నారని ప్రశ్నించారు. ఇండ్లు ఖాళీ చేయాలని అధికారులు అడిగితే నిలదీయాలని ప్రజలకు సూచించారు. మూసీ పేరుతో జరుగుతున్న లూటీకి చరమగీతం పాడాలన్నారు. నాలా అభివృద్ధి పనుల వల్ల గతంలో మునిగిన కాలనీలు ఇప్పుడు సురక్షితంగా ఉన్నాయన్నారు.

ముఖ్యమంత్రి గ్రాఫిక్స్ మాయాజాలానికి మోడిగా ఆగం కావొద్దన్నారు. మూసీలోని మురికి నీరు ఎస్టీపీలో ఎలా శుభ్రం అవుతుందో కేటీఆర్ చూపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సీవరేజ్ ఎ÷-లాంట్ల ఏర్పాటును కేటీఆర్ చేపట్టారని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. రూ.3800 కోట్లతో 31 ఎస్టీపీల

## కివీస్‌పై సెంచరీ..
## దిగ్గజాల సరసన సర్ఫరాజ్

మొదటి పేజీ తరువాయి

ఈ జాబితాలో మాధవ్ ఆప్టే (0,163: వెస్టిండీస్‌పై), సునీల్ గావస్కర్ (0,118: ఆస్ట్రేలియాపై), దిలీప్ వెంగసర్కార్ (0,103: ఇంగ్లండ్‌పై), మహ్మద్ అజారుద్దీన్ (0,109: పాకిస్థాన్‌పై), సచిన్ తెందూల్కర్ (0,136: పాకిస్థాన్‌పై), శిఖర్ ధావన్ (0,114: న్యూజిలాండ్‌పై), విరాట్ కోహ్లీ (0,104: శ్రీలంకపై), శుభ్‌మన్ గిల్ (0,119: బంగ్లాదేశ్‌పై) ఈ జాబితాలో ఉన్నారు. ఇదిలా ఉండగా, కివీస్ తొలి ఇన్నింగ్స్‌లో 402 పరుగులు చేయగా.. భారత్ 46 పరుగులకే ఆలౌటైన విషయం తెలిసిందే.

## నిజామాబాద్ జిల్లాలో దారుణం
### మహిళను ఆటోలో ఎక్కించుకుని అత్యాచారం



నిజామాబాద్ జిల్లాలో దారుణం చోటుచేసుకుంది. ఓ మహిళపై నలుగురు దుండగులు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఆటోలో మహిళను ఎక్కించుకుని తీసుకెళ్లి వారు ఈ అఘాయిత్యానికి పాల్పడ్డారు. శుక్రవారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకోగా.. శనివారం ఉదయం బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. శుక్రవారం రాత్రి ఒంటరిగా ఉన్న మహిళను పలువురు వ్యక్తులు ఆటోలో నిజామాబాద్ బస్టాండ్ వద్ద ఎక్కించుకున్నారు. అక్కడి నుంచి డిచ్‌పల్లి ప్రాంతానికి తీసుకువెళ్లి అఘాయిత్యానికి పాల్పడ్డారు. అనంతరం బాధితురాలు నగరానికి చేరుకుని శనివారం ఉదయం జిల్లా కేంద్రంలోని ఒకటో పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ అఘాయిత్యానికి పాల్పడిన వారు డిచ్‌పల్లికి చెందిన వారిగా పోలీసులు అనుమానిస్తున్నారు. బాధిత మహిళను వెంటబెట్టుకుని ఘటనాస్థలికి తీసుకెళ్లి పోలీసులు పరిశీలించారు. బస్టాండ్ వద్ద ఆటోకు సంబంధించిన వీడియో ఫుటేజీలను పరిశీలిస్తున్నారు.

## ముగ్గురు యువకులకు శిరోముండనం
### యువకుడి ఆత్మహత్యా యత్నం
### పోలీసుల తీరుపై సర్వత్రా విమర్శలు

జిల్లాలో అమానుషం చోటు చేసుకుంది. ఓ కేసు విషయంలో లింగాల పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ముగ్గురు యువకులతో ఓ ఎస్సై దురుసుగా ప్రవర్తించాడు. తన ముందే ఓ యువకుడు తల దువ్వుకున్నాడని కోపంతో ఊగిపోయిన ఎస్సై.. ముగ్గురు యువకులకు గుండు గీయించాడు. దీంతో మనస్తాపానికి గురైన యువకుడు ఆత్మహత్యకు యత్నించాడు. నాగర్‌కర్నూలు జిల్లా లింగాల వద్ద ఓ పెట్రోల్ బంక్ సిబ్బందితో ముగ్గురు యువకులకు ఇటీవల గొడవ జరిగింది. దీనిపై పెట్రోల్ బంక్ సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేశారు. ముగ్గురు యువకులను పోలీస్ స్టేషన్‌కు పిలిపించిన ఎస్సై జగన్మోహన్ రెడ్డి.. వారికి వార్నింగ్ ఇచ్చాడు. ఆ సమయంలో ఓ యువకుడు తల దువ్వుకోవడంతో ఎస్సై సీరియస్ అయ్యాడు. నా ముందే తలదువ్వుకుంటావా అని వారిపై కోపంతో రెచ్చిపోయాడు. వెంటనే
ముగ్గురు యువకులకు గుండు గీయించాడు. ఇలా అందరిముందు గుండు గీయించడంతో ముగ్గురు యువకులు మనోవేదనకు గురయ్యారు. వారిలో నితీశ్ అనే యువకుడు తీవ్ర మనస్తాపం చెందాడు. తన పరువు పోయిందని భావించి ఉరివేసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. వెంటనే అతడిని నాగర్‌కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం నితీశ్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. మిగతా ఇద్దరు యువకులను ఊరు విడిచి హైదరాబాద్ వెళ్లిపోవాలని ఆదేశించినట్లు తెలుస్తోంది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటన ఇప్పుడు సంచలనంగా మారింది. అయితే ఇంత జరిగినప్పటికీ ఆ పోలీసులు మాత్రం తమ బుద్ధిని పోనిచ్చుకోలేదు. ఈ వివరాలు ఎక్కడా వెల్లడించవద్దంటూ హుకుం జారీ చేశారు.

## చెరువులోకి దూసుకెళ్లిన డ్రైవింగ్ కారు
### స్థానికుల సాయంతో ఇద్దరూ క్షేమం

ఓ వ్యక్తి డ్రైవింగ్ నేర్చుకుంటుండగా కారు చెరువులోకి దూసుకెళ్లింది. డ్రైవింగ్ నేర్చుకుంటున్న వ్యక్తి, నేర్పుతున్న వ్యక్తి ఇద్దరూ కారులోనే చిక్కుకుపోయారు. స్థానికులు గమనించి వారికి సాయం చేయడంతో ఇద్దరూ సురక్షితంగా ఈదుకుంటూ బయటికి వచ్చారు. జనగామ పట్టణంలో ఈ ఘటన చోటుచేసుకుంది.



జనగామలోని బతుకమ్మ కుంట పక్కన ఉన్న గ్రౌండ్‌లో ఓ వ్యక్తి మరో వ్యక్తికి కారు డ్రైవింగ్ నేర్పుతున్నాడు. ఈ క్రమంలో అయోమయానికి గురైన ట్రెయినీ డ్రైవర్ కారు బ్రేక్‌కు బదులుగా యాక్సిలేటర్ తొక్కాడు. దాంతో కారు చెరువులోకి దూసుకెళ్లింది. ఇది గమనించిన స్థానికులు డోర్ లాక్ తీసి ఈదుకుంటూ రండి అని సూచించగా లాక్ రాలేదు. దాంతో విండోలోంచి దూకి ఈదుకుంటూ ఒడ్డుకు చేరారు. కారు ఇంకాస్త లోపలికి వెళ్లి ఉంటే ఇద్దరి ప్రాణాలు పోయేవి. ఈ ఘటనకు సంబంధించిన వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

## నివేదిక తర్వాతే..
### రైతు భరోసా పథకం అమలు : మంత్రి తుమ్మల

మొదటి పేజీ తరువాయి

రాష్ట్రంలో రైతు బీమా, రుణ మాఫీ, రైతు భరోసా, ధాన్యం, పత్తి, ఇతర పంటల కొనుగోళ్లు కనీస మద్దతు ధర, ఇతర వ్యవసాయ అంశాల గురించి మంత్రి మాట్లాడారు. మంత్రివర్గ ఉపసంఘం నివేదిక రాగానే రాబోయే పంట కాలం నుంచి రైతులకు ఎకరాకు రూ.7500 సాయం అందిస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు రూ.2 లక్షల కంటే ఎక్కువ రుణాలు ఉన్న రైతు కుటుంబాలను గుర్తించి డిసెంబరులోగా వారి బ్యాంకు ఖాతాల్లో నిధులు జమ చేస్తామన్నారు. అదేవిధంగా రూ.2 లక్షలకు పైగా రుణాలు ఉన్న, నిర్ధరణ కాని రైతు కుటుంబాల కోసం త్వరలో షెడ్యూల్ ప్రకటించి అర్హులైన వారికి న్యాయం చేస్తామని ప్రకటించారు. రాష్ట్రంలో ప్రకృతి విపత్తుల కారణంగా దెబ్బతిన్న పంటలకు ఎకరాకు రూ.10 వేలు పరిహారం ఇస్తున్నామన్నారు. పంట బీమా పథకం వచ్చే సీజన్ నుంచి అమలు చేస్తామని వెల్లడించారు. కేంద్రం ప్రకటించిన కనీస మద్దతు ధర(ఎంఎస్పీ)కే అన్ని పంటలను కొనుగోలు చేస్తున్నప్పటికీ... ప్రస్తుతం 25 శాతం మాత్రమే తీసుకుంటుందని కేంద్రం చెప్పారు. పూర్తిస్థాయిలో కొనుగోలు చేయాలని కేంద్రానికి లేఖ రాశామని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రైతు కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి, టీజీ సీడ్స్ ఛైర్మన్ అన్వేష్ రెడ్డి, వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి, రైతు సంఘాల నేతలు సారంపల్లి మల్లారెడ్డి, పశ్య పద్మ, నల్లమల వెంకటేశ్వరరావు, లోకసాని పద్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కేసీఆర్ కుటుంబానిది దోపిడీ చరిత్ర: రేవంత్‌రెడ్డి

మొదటి పేజీ తరువాయి



హైడ్రా ఆగదు.. అక్రమార్కులకు కంటి మీద కునుకు ఉండదు రియల్ ఎస్టేట్ సంస్థలు భయపడొద్దు... వారికి నేను హామీ ఇస్తున్నా. మా ప్రభుత్వం మీకు అండగా ఉంటుంది. హైడ్రా ఆగదు.. అక్రమార్కులకు కంటి మీద కునుకు ఉండదు. హైడ్రా అనగానే హరీశ్‌రావు, కేటీఆర్ బయటకు వస్తున్నారు. పేదలకు మేలు జరిగితే చూసి ఓర్వలేకపోతున్నారు. మూసీలో మగ్గిపోతున్న వారికి ఇళ్లు ఇచ్చి, వ్యాపారాలు చేసుకునేందుకు మహిళలకు ఆర్థిక సాయం అందించాం. మేం వారిని గుండెల్లో పెట్టుకుంటుంటే భారాస నేతలు గుండెలు బాదుకుంటున్నారు. హరీశ్‌రావు, కేటీఆర్ ఫామ్ హౌస్‌ల విషయంపై అఖిలపక్షాన్ని పిలుద్దాం. నిజ నిర్ధారణ కమిటీతో నిజాలు నిగ్గు తేల్చుదాం. ఆ తరువాత మూసీ దగ్గరకా.. ఇంకెక్కడికైనా వెళదాం." అని రేవంత్‌రెడ్డి తెలిపారు.

## పోలీసుల అదుపులో బండి సంజయ్..
### చలో సచివాలయం ర్యాలీ ఉద్రిక్తం

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్: గ్రూప్-1 పరీక్షల నిర్వహణపై ప్రభుత్వం పునరాలోచన చేయాలని డిమాండ్ చేస్తూ కేంద్ర మంత్రి బండి సంజయ్ విద్యార్థులతో కలిసి చేపట్టిన చలో సచివాలయం ర్యాలీ ఉద్రిక్తంగా మారింది. అశోక్‌నగర్ నుంచి విద్యార్థులతో కలిసి ర్యాలీగా వచ్చిన బండి సంజయ్ తెలుగుతల్లి ఫ్లైఓవర్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. భారీగా చేరుకున్న పోలీసులు బండి సంజయ్‌ను అదుపులోకి తీసుకుని అక్కడి నుంచి తరలించేందుకు ప్రయత్నించగా.. గ్రూప్-1 అభ్యర్థులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులు నిరసనకారులకు మధ్య తోపులాట వాగ్వాదం చోటు చేసుకుంది. భారీగా చేరుకున్న పోలీసులు గ్రూప్-1 అభ్యర్థులు, భాజపా కార్యకర్తలను చెదరగొట్టిన పోలీసులు.. అతి కష్టం మీద బండి సంజయ్‌ను అక్కడి నుంచి తరలించారు.

## రేవంత్ సర్కార్‌కు బండి అండ

మొదటి పేజీ తరువాయి

వారు సరైన సమయం కోసం ఎదురు చూస్తున్నారని.. మూసీ, హైడ్రా, గ్రూప్- 1 విషయంలో సీఎం రేవంత్ తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే నష్టపోతారని హెచ్చరించారు. హైడ్రా, గ్రూప్-1 పరీక్షల ఆందోళలను మంత్రులు తమకు అనుకూలంగా మలచుకునేందుకు ప్రయత్నిస్తున్నారని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. ఈ వ్యాఖ్యలపై కేటీఆర్ ఘాటుగా స్పందించారు. రేవంత్ రెడ్డిని కాపాడేందుకు బండి సంజయ్ తపిస్తున్నారని, తెలంగాణలో ఉన్నది బీజేపీ అనుబంధ ప్రభుత్వంలా కనిపిస్తోందంటూ కేటీఆర్ చురకలు అంటిస్తూ ట్వీట్ చేశారు. ఇకపోతే తెలంగాణ ప్రభుత్వానికి మద్యంపై ఉన్న ధ్యాస రైతులకు మద్దతు ధర ఇచ్చేందుకు లేదని బీఆర్ఎస్ నేత కేటీఆర్ మరో ట్వీట్ చేశారు. మందుపై ఉన్న ధ్యాస మంచి బోధన, మందుబిళ్లలు, మూసీ బాధితులు, మంచినీళ్లపై లేదన్నారు. అలాగే పింఛన్ల పెంపుపై సీఎంకు శ్రద్ధ లేదన్నారు. ప్రభుత్వానికి మద్యంపై ఉన్న ధ్యాస రైతు భరోసా పెంపుపై లేదని ధ్వజమెత్తారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు బీఆర్ఎస్ ప్రభుత్వంపై అడ్డగోలు ఆరోపణలు చేశారని, అధికారంలోకి వచ్చిన తర్వాత అడ్డగోలుగా ధరలు పెంచేస్తున్నారని కేటీఆర్ ఆగ్రహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీరు పెంచుకో - దంచుకో - పంచుకో అన్న చందంగా ఉందని విమర్శించారు. నేడు మద్యం ధరల పెంచారని, రేపు ఏం పెంచుతారో, ఎంతెంత వసూలు చేస్తారో చూడాలంటూ ట్విటర్ వేదికగా కేటీఆర్ విమర్శించారు.

## 4 నెలల సమయం ఇవ్వండి..: జూడాలతో బెంగాల్ సీఎం

కోల్‌కతా ఆసుపత్రి ఘటనలో న్యాయం చేకూర్చాలని, తమ డిమాండ్లు నెరవేర్చాలని నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్న జూనియర్ వైద్యుల డిమాండ్లను నెరవేర్చడానికి 3-4 నెలల సమయం ఇవ్వాలని బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ వైద్యులను కోరారు.



కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ లోని ఆర్‌జీ కర్ ప్రభుత్వ ఆసుపత్రి ఘటనలో న్యాయం చేకూర్చాలని, తమ డిమాండ్లు నెరవేర్చాలని జూనియర్ వైద్యులు చేపట్టిన నిరవధిక నిరాహార దీక్ష కొనసాగుతోంది. కాగా ఈ విషయంపై బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ(%మీుఎఝు దీుఅవతీయవవ%) స్పందిస్తూ జూనియర్ వైద్యులు దీక్షను వీడాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి ఒక్కరికీ నిరసన తెలిపే హక్కు ఉందని, అయితే.. వైద్యారోగ్య సేవలపై దాని ప్రభావం పడకూడదని ఆమె వ్యాఖ్యానించారు. వైద్యులు తమ ముందుకు తెచ్చిన డిమాండ్లను ఇప్పటికే నెరవేర్చామని, మిగతా వాటి కోసం 3-4 నెలల సమయం ఇవ్వాలని మమత వైద్యులను కోరారు. ఈ విషయంపై చర్చలకు రావాలని మరోసారి జూనియర్ వైద్యులకు పిలుపునిచ్చారు. జూనియర్ డాక్టర్లు సోమవారం ప్రభుత్వంతో చర్చలు జరిపేందుకు రావాలని మమత మరోసారి ఆహ్వానించారు. ఆర్జీకర్ ఆసుపత్రి వద్ద నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్న జూనియర్ వైద్యుల వేదిక వద్దకు శనివారం చీఫ్ సెక్రటరీ మనోజ్ పంత్ వెళ్లారు. ఈ సమయంలో సీఎం వైద్యులతో ఫోన్‌లో మాట్లాడారు. వైద్యులు చేసిన పలు డిమాండ్లను నెరవేర్చడానికి విధానపరమైన నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉంటుందని ఆమె పేర్కొన్నారు. ఏం చేయాలి? ఏం చేయకూడదు? అనే విషయాలను ప్రభుత్వానికి వైద్యులు నిర్దేశించడం సరికాదని వ్యాఖ్యానించారు. వైద్యుల డిమాండ్లపై చర్చించిన అనంతరం నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు. కోల్‌కతాలోని ఆర్జీకర్ ప్రభుత్వ కళాశాల ఆసుపత్రిలో ఆగస్టు 9న జూనియర్ వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. బాధితురాలి కుటుంబానికి న్యాయం చేయాలని వైద్య విద్యార్థులు పెద్దఎత్తున నిరసనలు కొనసాగించారు. సీఎం మమతా బెనర్జీ తమ డిమాండ్లను నెరవేర్చేందుకు హామీ ఇవ్వడంతో.. 42 రోజుల పాటు కొనసాగిన నిరసనలు విరమించి గత నెల 21న పాక్షికంగా విధుల్లో చేరారు. అయితే ప్రభుత్వం నుంచి సానుకూల చర్యలు లేకపోవడంతో నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్నారు. దీక్షలో పాల్గొన్న పలువురు అనారోగ్యానికి గురవుతుండటంతో సీనియర్ వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం త్వరగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

## కేటీఆర్.. ఎక్కువగా అరవకు

మొదటి పేజీ తరువాయి

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌కు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ స్ట్రాం కౌంటర్ ఇచ్చారు. తెలంగాణ ముఖ్యమంత్రి పదవి, సీఎం రేవంత్ రెడ్డిపై తాను చేసిన వ్యాఖ్యలకు కేటీఆర్ ట్వీట్ చేయడంపై బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి కుర్చీని కాపాడేందుకు బండి సంజయ్ తాపత్రయ పడుతున్నారని, రాష్ట్రంలో ఉన్నది కాంగ్రెస్ ప్రభుత్వమా? లేక బీజేపీ అనుబంధ ప్రభుత్వమా? అంటూ కేటీఆర్ ట్వీట్ చేశారు. దీనికి కౌంటర్‌గా గత బీఆర్ఎస్ ప్రభుత్వం, కేటీఆర్‌పై కేంద్ర మంత్రి సంచలన వ్యాఖ్యలు చేశారు.

ఈ సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ.. ' కేటీఆర్ అరవకు. ఫోన్ ట్యాపింగ్ కేసులో నువ్వు, మీ నాన్న కేసీఆర్ దోషులు. ఎందుకు మిమల్ని సీఎం రేవంత్ రెడ్డి అరెస్టు చేయడం లేదు. తండ్రికొడుకులు ఇద్దరూ ఢిల్లీకి వెళ్లి కాంగ్రెస్ పెద్దల కాళ్లు పట్టుకుంది నిజం కాదా?. రేవంత్ రెడ్డి.. నీకు దమ్ముంటే ఫోన్ ట్యాపింగ్ కేసు సీబీఐకి అప్పగించాలి. మేము కూడా కేంద్రం తరుపున సీబీఐని రిక్వెస్ట్ చేస్తాం. అప్పుడు బీఆర్ఎస్, కాంగ్రెస్ ఒక్కటేనని బయటపడుతుంది. హర్యానా, జమ్మూకశ్మీర్ ఎన్నికలకు కాంగ్రెస్ ఖర్చు చేసిన డబ్బు బీఆర్ఎస్ పార్టీ ఇచ్చినదే. కేటీఆర్ అహంకారమే ఆ పార్టీని ఈ దుస్థితికి తెచ్చింది. నీ అహంకారపూరిత మాటల వల్లే మీ పార్టీ గత ఎన్నికల్లో ఓడిపోయింది. ఇప్పుడు మళ్లీ అదే రకంగా మాట్లాడుతున్నావు. కాంగ్రెస్, బీజేపీ ఒక్కటి కానే కాదు. దోస్తులమైతే ఫోన్లలో మాట్లాడుకుంటాం. మీడియాకు స్టేట్మెంట్లు ఇవ్వం. అసలు దోస్తానా కేసీఆర్, కాంగ్రెస్ కే ఉంది అంటూ వ్యాఖ్యానించారు.

హర్యానా, జమ్మూకశ్మీర్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి డబ్బు సహాయం చేసింది కేసీఆరే. డబ్బు సంచులతో ఢిల్లీకి వెళ్లి కాంగ్రెస్ పెద్దలకు ఇచ్చింది వాస్తవం కాదా?. మీ రెండు పార్టీల మధ్య స్నేహ సంబంధాలు లేకపోతే ఫోన్ ట్యాపింగ్ కేసు ఎందుకు ముందుకు సాగడం లేదు. ఈ కేసులో కేసీఆర్ ఆదేశాల మేరకే అధికారులు ట్యాపింగ్ చేసినట్లు క్లియర్‌గా రిపోర్టు ఉంది. ఈ రిపోర్టు ప్రకారం కనీసం ఆయనకు 41సీఆర్పీసీ నోటీసూ ఎందుకు ఇవ్వడం లేదు. దీన్ని బట్టి అర్థమవుతుంది బీఆర్ఎస్, కాంగ్రెస్ ఒక్కటేనని. మీ మధ్యలో స్నేహం లేకపోతే కేసును సీబీఐకి అప్పగించండి. సీబీఐ ద్వారా విచారణ జరిపితే అన్ని విషయాలు బయటకు వస్తాయి' అన్నారు.

## తేలిపోయిన రాహుల్ గాంధీ రాజ్యాంగ ప్రదర్శన

మొదటి పేజీ తరువాయి

నాటి పర్యవసానాల స్మరణకు అవకాశం కల్పిస్తున్నారు. 1978లో పంజాబ్‌లో ఏర్పడిన అకాలీదళ్ - జనతా సంకీర్ణ ప్రభుత్వాన్ని అస్థిరం చేయడానికి అకాలీలను ఇరకాటంలో పెట్టే ఒక ఉన్మత్త మత బోధకుడు అవసరమని కాంగ్రెస్ భావించిన సమయంలోనే భింద్రెన్‌వాలే పుట్టుకొచ్చాడు. ఈ పథకం ఎలా పురుడుపోసుకున్నదో ఇప్పటికే పలు గ్రంథాలలో నమోద్కై ఉంది కూడా. మిగతాదంతా చరిత్ర. కానీ ఇందిరకు అధికారం కట్టబెట్టినది ఈ కుట్ర కానే కాదు. జనతా పార్టీలో లుకలుకలు ఆ పని చేశాయి. కానీ భింద్రెన్‌వాలే పావుగా కాంగ్రెస్ పన్నిన పథకం ఆమె ప్రాణంమాత్రం తీసుకుంది. స్వర్ణ దేవాలయం మీదకు సైన్యాన్ని పంపక తప్పని పరిస్థితిని కల్పించినదీ, పంపినదీ కాంగ్రెస్ పార్టీయే. ఇందిర హత్య తరువాత లక్షల కొద్దీ సిక్కులు పంచ కకారాలను పక్కన పెట్టవలసి వచ్చిందీ అప్పుడే. కాంగ్రెస్ పార్టీ రక్తదాహానికి దాదాపు మూడు వేల మంది సాధారణ సిక్కులు బల్కైనదీ అప్పుడే. ఇవి దాచేస్తే దాగని సత్యాలు. వీటిని చారిత్రక సత్యాలుగా, గుణపాఠాలుగా మొదట గ్రహించవలసిన వారు ఎవరైనా ఉన్నారు అంటే, వారు రాహుల్, కాంగ్రెస్ పార్టీయే. అయితే వాస్తవాలు గుర్తించాలన్న దృష్టి కాంగ్రెస్‌కు లేదు. దానికి రాదు. ఉంటే స్వర్ణాలయం మీద దాడికీ, అమాయక సిక్కుల ఊచకోతకీ కాంగ్రెస్ పార్టీ ఈపాటికే సరైన రీతిలో క్షమాపణ చెప్పి ఉండేదే!

కరపత్రం తెలుగు దిన పత్రిక
ఆదివారం అక్టోబర్ 20 2024

# శతాబ్దాల చరిత్ర కలిగి " ప్రాభవం "
# కోల్పోతున్న తెలంగాణ శిల్పకళా " వైభవం "

- అపర భద్రాద్రిగా పేరొందినను ఆదరణకు నోచుకోని ఇల్లంతకుంట " రామాలయం "
- గత వైభవానికి " మెరుగులు " దిద్దడమే ప్రభుత్వాల " గొప్ప" తనమా ?
- కాకతీయుల అద్భుత " కళా సృష్టికి సిర్సపల్లి " శివాలయమే " తార్కాణం
- దేవాలయాలపై రాజకీయపరమైన కుహనాశక్తుల " నీలి నీడలు "
- " యునెస్కో " వారు స్పందించే వరకు మనవాళ్లు " గాఢ నిద్రలోనే "



కరపత్రం/ హుజురాబాద్/ ప్రతినిధి

హుజురాబాద్ అక్టోబర్ 19, తూర్పు నుండి పశ్చిమం వరకు... పడమర నుండి ఉత్తరం వరకు తెలంగాణ వ్యాప్తంగా శతాబ్దాల క్రితమే పురుడు పోసుకున్న అద్భుతమైన శిల్పకళా వైభవం రాను రాను తన ప్రాశస్త్యాన్ని... ప్రభావాన్ని కోల్పోతున్నది. మన గుళ్ళు... గోపురాలు ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందినప్పటికీ మన పాలకుల... మన ప్రభుత్వాల నిర్లక్ష్యానికి అవి కాలగర్భంలో కలిసిపోయే ప్రమాదం ఉందని పురాతత్వ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. వందల సంవత్సరాల క్రితమే మన పూర్వీకులు... రాజులు... చక్రవర్తులు.... పురాతత్వశాస్త్రవేత్తల ఊహలకు సైతం అందరి విధంగా తీర్చిదిద్దబడిన శిల్పకళలతో కూడిన దేవాలయాలను భావితరాల కోసం కాపాడవలసిన ప్రభుత్వాలు చేతులెత్తేస్తుండడంతో చరిత్ర మనకు అందించిన అపూర్వ కళా సంపద కనుమరుగయ్యే ప్రమాదం ఉంది. దేశవ్యాప్తంగా భద్రాచలం రామాలయానికి ఎంతటి గుర్తింపు ఉన్నదో.... కరీంనగర్ జిల్లా హుజురాబాద్ నియోజకవర్గం పరిధిలోని ఇల్లంతకుంట మండల కేంద్రంలో గల శ్రీ సీతారామచంద్ర స్వామి వారికి సంబంధించిన రామాలయం కూడా అపర భద్రాద్రిగా పిలవబడుతున్న విషయం జగద్విదితమే. ప్రతి సంవత్సరం రాముల వారి కళ్యాణం భద్రాచలంలో ఏ స్థాయిలో జరుగుతుందో దాదాపు అదే స్థాయిలో ఉత్తర తెలంగాణలోని ఇల్లంతకుంట లో ఈ కళ్యాణ మహోత్సవ ఘట్టం అదే రీతిలో జరుగుతుండడం మన అందరికీ తెలిసిన విషయమే. అయినప్పటికీ ఇల్లందకుంట రామాలయాన్ని నభూతో న భవిష్యత్తు అనే తరహాలో తీర్చిదిద్దవలసిన ప్రభుత్వాలు మొక్కుబడి చర్యలకు మాత్రమే పరిమితం అవుతుండడం పట్ల భక్తులు... సామాన్య ప్రజల నుండి ఆగ్రహ వేషాలు వ్యక్తమవుతున్నాయి. ఇల్లంతకుంట ఆలయ పరిసరాలలో అపారమైన ల్యాండ్ బ్యాంక్ ఉన్నందున పర్యాటకులను విశేషంగా ఆకర్షించేలా ఈ ప్రాంతాన్ని టూరిజం స్పాట్ గా అభివృద్ధి చేయడానికి ఏ ఒక్కరూ ముందుకు రాకపోవడం శోచనీయం. ఎన్నికలు వచ్చిన ప్రతిసారి ఆలయం చుట్టూ రాజకీయాలు చేసే నేతలు ఆ తర్వాత తమ హామీలను నిమజ్జనం చేయడం వరకే పరిమితం అవుతుండడం భక్తులను వహించడమే.

## సిర్సపల్లి " శివాలయం " పై అజ్ఞాత శక్తుల " నీలి నీడలు " ?

ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని హుజురాబాద్ మండలం సిర్సపల్లి గ్రామంలో గల శివాలయం కూడా దాదాపు 11, 12వ శతాబ్దంలో అనగా సుమారు 800 సంవత్సరాల క్రితం కాకతీయ రాజులు తమ అద్భుతమైన తెలివితేటలతో... ప్రజ్ఞ పాటవాలతో శిల్పకళా వైభవం ఉట్టిపడేలా ఈ ఆలయాన్ని నిర్మించినట్లు చరిత్రకారులు చెబుతుంటారు. దాదాపు 14 గుంటల విస్తీర్ణంలో నిర్మించబడిన ఈ ఆలయం పై కొన్ని సంవత్సరాల నుండి గ్రామంలోని కొంతమంది శక్తులు పెత్తనం చలాయిస్తున్నట్లు సమాచారం. రామప్ప... వేయి స్తంభాల గుడి వంటి అపురూపమైన దర్శనీయ స్థలాలకు ఏమాత్రం తీసుకొని రీతిలో అద్భుతంగా చెక్కబడి మానవుని మేధాశక్తికి... అతనిలోని కళాతృష్ణకు ప్రతీకగా దర్శనమిస్తున్న సిర్సపల్లి " శివాలయం " 36 డిగ్రీల కోణంలో నిర్మించబడినట్లుగా తెలుస్తోంది. ఈ ఆలయం ప్రాంగణంలోని కోనేరు ( అనగా స్వయంభు గుండం ) కొన్ని శతాబ్దాల క్రితమే తనంతట తానుగా ఉద్భవించడం ( అనగా వెలిసినట్లు ) నేటికీ ఊహకందని విషయం గానే చెప్పుకోవచ్చు. ఎంతగా కరువు కాటకాలు వచ్చినను... ప్రకృతి వైపరీత్యాలు సంభవించినను ఈ కోనేరులో నీరు మాత్రం " ఇంకి " పోనేపోదని గ్రామస్తులు పేర్కొంటున్నారు. పాతిక సంవత్సరాల క్రితం కెనాల్ లైనింగ్ పనుల కోసం వచ్చిన ప్రసాద్ అండ్ ప్రసాద్ అనే కంపెనీ ఈ ఆలయం చుట్టూ ప్రహరీ గోడ నిర్మించిన విషయం విధితమే. ఇక్కడి శివాలయం నుండి అనేక ప్రాంతాలను స్పృశిస్తూ సాక్షాత్తు వేములవాడ వరకు పాదముద్రికలు ఉన్నట్లు సమాచారం. రామప్ప... వేయి స్తంభాల గుడి వంటి దర్శనీయ స్థలాలను తిలకించినప్పుడు ఆ రాతి స్తంభాలను మలచిన తీరును... వివిధ భంగిమలుగా ఆనాటి శిల్పులు తీర్చిదిద్దిన నైపుణ్యాలను... అద్భుత రాతి చెక్కడాలను చూసిన అనుభూతి కలుగడమే కాకుండా ఆ జ్ఞాపకాలు మదిలో స్థిరంగా ఉండిపోతాయి. కానీ రామప్ప... వేయి స్తంభాల గుడి వంటి అద్భుత శిలా సంపద మాదిరిగానే శతాబ్దాల క్రితం నిర్మితమైన సిర్సపల్లి " శివాలయం " మొత్తాన్ని సిమెంట్ తో ఫ్లోరింగ్ చేయడం వల్ల ఈ ఆలయం రాతి స్తంభాలతో నిర్మించబడిందా..... లేక మట్టి దిమ్మెలతో నిర్మించబడిందా అనే విధంగా ప్రస్తుతం దాని పరిస్థితి తయారయింది. దీనంతటికీ గ్రామంలోని కొన్ని అజ్ఞాత శక్తుల స్వార్థపూరిత చర్యలే కారణమని ఊహాగానాలు వినబడుతున్నాయి. శతాబ్దాల క్రితం నిర్మించబడిన అద్భుతమైన కళా సంపదను కాపాడవలసిన నేటితరం వినాశకర విధానాలకు శ్రీకారం చుట్టడం చరిత్ర ఎప్పటికీ క్షమించదని కొంతమంది గ్రామస్తులే బహిరంగంగా వ్యాఖ్యానిస్తుండడం గమనార్హం. సిమెంటు కోటింగ్ వల్ల గత వైభవాన్ని... గత ప్రాశస్త్యాన్ని... గతంలోని తేజస్సును కోల్పోయి ఈ శివాలయం అంద విహీనంగా తయారు కావడం పట్ల నిజమైన భక్తులలో ఆవేదన ఆందోళన



వ్యక్తమవుతోంది. వందలాదిమంది శిల్పులు పెద్ద పెద్ద బండరాళ్లను ఏళ్ల తరబడి శ్రమించి అద్భుతమైన కళాఖండాలతో ఈ శివాలయాన్ని నిర్మిస్తే నేడు గత ఆనవాళు కనుమరుగై కళా విహీనంగా దర్శనమిస్తోంది. ప్రతి సంవత్సరం ఫిబ్రవరి నెలలో జరిగే మహాశివరాత్రి ఉత్సవాలకు అనేక గ్రామాల నుండి భక్తజనులు వేలాదిగా తరలివస్తుండడంతో ఈ గ్రామంతో పాటు శివాలయం ప్రాంగణం కిక్కిరిసి దర్శనమిస్తుంటుంది. దాదాపు కొన్ని వేల మందికి ఆరోజు ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తుండడం ఆనవాయితీగా వస్తోంది. ఇంతటి ప్రశస్తమైన సిర్సపల్లి శివాలయాన్ని దేవాదాయ శాఖ పరిధిలోకి తేవాలని రోజురోజుకు డిమాండ్ పెరుగుతున్నప్పటికీ ఒక వర్గానికి చెందిన కొంతమంది ఈ ప్రయత్నానికి అడ్డుపడుతున్నట్లు సమాచారం. దేవాదాయ శాఖ అధికారుల అలసత్వం వల్ల ఈ శివాలయం ఎండోమెంట్ పరిధిలోకి వెళ్లడం లేదా..... లేక కొంతమంది స్వార్థపూరిత చర్యల కారణంగా ఆటంకం ఏర్పడుతోందా అనేది ప్రశ్నార్ధకంగా తయారైంది.

## " యాదాద్రి " వరకే పరిమితమైతే మిగతా ఆలయాల పరిస్థితి ఏమిటి ?

హైదరాబాద్ సమీపంలో గల యాదాద్రి దేవాలయాన్ని వేల కోట్ల రూపాయలతో తీర్చిదిద్దితే రాష్ట్రంలోని మిగతా దేవాలయాల పరిస్థితి ఏమిటని సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. అద్భుతంగా నిర్మించబడి ఆ తర్వాత ప్రభావాన్ని కోల్పోయిన దేవాలయాలు అడుగడుగున ఉన్నాయని... వాటిని జీర్ణోద్ధరణ చేయవలసిన ప్రభుత్వాలు యాదాద్రి వంటి కొన్ని దేవాలయాల అభివృద్ధి వరకే పరిమితమై మిగతా వాటిని గుర్తించకపోవడం ఎంతవరకు సమంజసం అని భక్తులు ప్రశ్నిస్తున్నారు. అభివృద్ధికి నోచుకోకుండా మసకబారిన శిల్పకళా సౌందర్యంతో ఉట్టిపడే ప్రతి ఆలయాన్ని గుర్తించి భక్తుల మనోభావాలకు అనుగుణంగా తీర్చిదిద్దినట్లయితే రాష్ట్రంలో కొత్తగా అనేక టూరిజం స్పాట్లు ఏర్పడే అవకాశం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

## ప్రకటనల వరకే పరిమితమైతే ఎలా ?

వేములవాడ... కొండగట్టు దేవస్థానాలను 100 కోట్ల చొప్పున నిధులు కేటాయించి తెలంగాణకే తల మానికంగా వాటిని తీర్చిదిద్దుతామని ప్రభుత్వాలు ప్రకటనలు ఇవ్వడం తప్ప ఏళ్లు గడుస్తున్నప్పటికీ తాము ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడం పట్ల ముఖ్యమంత్రి లాంటి నేతల పట్లనే ప్రజలు విశ్వాసం కోల్పోయే పరిస్థితి వచ్చిందని వ్యాఖ్యానాలు వినబడుతున్నాయి. ప్రతి సంవత్సరం పొడవునా సాధారణ భక్తులు... అంజన్న భక్తులు లక్షలాదిగా తరలివచ్చే కొండగట్టు పుణ్యక్షేత్ర పరిస్థితి





దశాబ్దాల తరబడిగా దారుణంగా ఉంటున్నప్పటికీ స్పందించడానికి ఇంతవరకు ఏ ఒక్క ప్రజా ప్రతినిధి ముందుకు రాకపోవడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఇకపోతే భీమదేవరపల్లి మండలం కొత్తకొండ వీరభద్ర స్వామి ఆలయం ఎంతో ప్రసిద్ధి చెందడం వల్ల ఉత్సవాల సమయంలోనే కాకుండా ఏడాది పొడవునా భక్తుల తాకిడి విపరీతంగా ఉంటుందని... ఎవరు శ్రద్ధ చూపడం లేదని కొత్తకొండ ప్రాంతవాసులు పేర్కొంటున్నారు. హుస్నాబాద్ శివారులో ఒక రైతు పొలం నుండి 20 సంవత్సరాల క్రితం అతిపెద్ద శివలింగం బయల్పడగా... పొట్లపల్లి గ్రామస్తులు సంఘటితమై రామలింగేశ్వర స్వామి ఆలయ నిర్మించి ప్రతి ఏటా తమ సొంత ఖర్చులతో ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ఈ దేవాలయాన్ని స్వయంభు దేవాలయంగా ప్రతి ఒక్కరు పిలుస్తుండడంతో సిద్దిపేట జిల్లాలో ఈ పుణ్యక్షేత్రం దర్శనీయస్థలంగా భక్తులను విశేషంగా ఆకర్షిస్తున్న సంగతి తెలిసిందే.

## " యునెస్కో " వాళ్లు స్పందించే వరకు మన ప్రభుత్వాలు "నిద్రావస్థలోనే " ?

ప్రపంచ ప్రాచిన వారసత్వ సంపదగా రామప్ప.... వేయి స్తంభాల గుడి ప్రాంతాలను యునెస్కో వాళ్లు గుర్తించే వరకు మన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిద్రావస్థలోనే ఉండడం దారుణమైన విషయమని... యునెస్కో స్పందన తర్వాత బిజెపి నేత కిషన్ రెడ్డి పర్యాటక శాఖ మంత్రిగా ఉన్నప్పుడు కేంద్రం నుండి కొన్ని నిధులు మంజూరు చేయించారని... ఆ తర్వాత పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందన తయారైనట్లు విమర్శలు వెలువెత్తుతున్నాయి. మరో ముఖ్యమైన విషయం ఏమిటంటే ప్రపంచంలోనే అత్యంత బిగ్గెస్ట్ జన జాతరగా పేరుగాంచిన మేడారం సమ్మక్క... సారలమ్మలు కొలువుండే ప్రాంతాన్ని కొన్ని వేల కోట్లతో అభివృద్ధి చేయవలసి ఉన్నప్పటికీ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం విషయంలో పోటీపడుతుండడం ఎంతైనా బాధాకరం. ఇప్పటికైనా ప్రభుత్వాలు చొరవ చూపి మన ఆలయాలను... మన శిల్పకళ సంపదను పదిలంగా కాపాడినప్పుడే ప్రపంచ ప్రసిద్ధిగాంచిన ఆనాటి తరాలకు చెందిన " శిల్పుల " ప్రజ్ఞ పాటవాలను మనం గుర్తించినట్లు అవుతుందనడంలో ఎలాంటి సందేహం లేదేమో.

# ట్రాఫిక్ పద్మ వ్యూహంలో చిక్కుకొని విలవిలలాడుతున్న ప్యాసింజర్ల పాట్లు

కిరణ్ చిట్యాల,
కరపత్రం రిపోర్టర్, కుత్బుల్లాపూర్ నియోజక వర్గం




నిన్న ట్రాఫిక్ పద్మ వ్యూహంలో చిక్కుకొని ఏమీ చెయ్యలేని తన బాధాకర అనుభవాన్ని డాక్టర్ శ్రీనివాస్ కాశా కరపత్రంతో,తన తోటి వారితో చెప్పుకున్నారు.కిమ్స్ లో ఆర్థోపెడిక్ సర్జన్ గా సేవలు చేస్తున్న డాక్టర్ శ్రీనివాస్ సాయంత్రం గం.6.30 కు ఆఫీస్ నుండి సుచిత్రలోని తన నివాసానికి బయలు దేరాడు.సుచిత్రలో ఒక అర్జంట్ కమిట్మెంట్ కొరకు బయలుదేరిన తను తొందరగా చేరుకోవాలని సికింద్రాబాద్ రాణీగంజ్ నుండి బయలు దేరితే ప్యారడైజ్ సర్కిల్ చేరుకోవడానికి ఒక గంట సమయం పట్టిందని,దీనివల్ల తన అర్జంట్ అసైన్ మెంట్ మిస్ అయ్యిందని వేదన చెందారు.
తన లాగే ఈ ట్రాఫిక్ లో చిక్కుకున్న చాలామంది బయటపడడానికి పడుతున్న ఇబ్బందులు చూసానని అన్నారు.అత్యవసర పనులపై బయలుదేరిన ఎంతోమంది ఈ నిరంతర ట్రాఫిక్ ఇబ్బందులతో వేదన చెందుతున్నారని అన్నారు.నగరం నడిబొడ్డులో పరిస్థితి ఇలా ఉంటే కలల నగరంగా వికసించాలనుకుంటున్న హైద్రాబాద్ తన గొప్ప లక్ష్యాలను ఎలా అందుకుంటుందని ప్రశ్నించారు.అంబులెన్స్ లో చావుబతుకుల్లో ఉన్న పేషంట్ల పరిస్థితి ఏమిటని బాధపడ్డారు.పన్ను చెల్లింపు దారుల డబ్బుకు తగిన విలువ ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వానికి లేదా? అని 260 కుటుంబాలు నివాసముంటున్న తన కమ్యూనిటీ వాసులతో మాట్లాడుతూ తన మనోవేదన పంచుకున్నారు.హైద్రాబాద్ మహా నగరానికి ఉత్తరాన ఉన్న ప్రాంతాలకు అందాల్సిన మెట్రో లైన్ సేవలను నిర్లక్ష్యం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకొని మెట్రో రైల్ ను ఈ ప్రాంతాలకు చేరేలా నిర్ణయం తీసుకోవాలని కోరారు.ఈ మధ్యన చాలాసార్లు కొంపల్లి,సుచిత్ర ప్రాంతాల ప్రజలు మెట్రో రైల్ సాధన కమిటీగా ఏర్పడి ధర్నాలు కూడా చేసారు. ప్రజల కోరిక మన్నించి ప్రభుత్వం వెంటనే ఈ ప్రజా డిమాండ్ నెరవేర్చాలని కోరుతున్నారు.

# పివి సింధుకు మరో ఏడాది పాటు వెసలుబాటు ఆన్‌డ్యూటీ కాలాన్ని పొడిగించిన ప్రభుత్వం

ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. డిప్యూటీ కలెక్టర్ హోదాలో ఉన్న బ్యాడ్మింటన్ స్టార్ ప్లేయర్ పీవీ సింధుకు ఆన్ డ్యూటీ సదుపాయాన్ని మరో ఏడాది పొడిగించింది. ఆసియా, కామన్‌వెల్త్ క్రీడలతో పాటు 2025-26లో వివిధ అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనేందుకు శిక్షణ నిమిత్తం పీవీ సింధుకు ఆన్ డ్యూటీ సదుపాయాన్ని పొడిగించింది. వచ్చే ఏడాది సెప్టెంబర్ 30వ తేదీ వరకు ఓడీని పొడిగిస్తూ ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.బ్యాడ్మింటన్ ప్లేయర్ పీవీ సింధు 2016 ఒలింపిక్స్‌లో సిల్వర్ మెడల్ సాధించారు. దీంతో అప్పటి తెలుగు ప్రభుత్వాలు పీవీ సింధును ఘనంగా సన్మానించడంతో పాటు నజరానా ప్రకటించాయి. గ్రూప్-1 హోదాతో ప్రభుత్వ ఉద్యోగం కూడా ఆఫర్ చేశాయి. అయితే ఏపీలో ప్రభుత్వ ఉద్యోగం చేసేందుకు పీవీ సింధు సుముఖత వ్యక్తం చేశారు.

# మతోన్మాద ఇస్లాం జీహాదీలపై చర్యలకై కోరుట్లలో హిందూ సంఘాల ధర్నా,ఆర్డీవో కు వినతి పత్రం

కరపత్రం ప్రతినిధి కోరుట్ల నియోజక వర్గం




తెలంగాణలో ఇస్లామిక్ జిహాదీలు ప్రణాళికా బద్ధంగా హిందూ మందిరాలపై దాడులు చేస్తూ హిందూ దేవీ దేవతల విగ్రహాలు ధ్వంసం చేస్తున్నారు.హైద్రాబాద్ లోని ముత్యాలమ్మ విగ్రహ ద్వంసంపై పెద్ద ఎత్తున హిందువులు ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు. మారేడ్ పల్లి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసారు. హిందువుల మనోభావాలను తెలంగాణ కాంగ్రెస్ ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి కనీసం పట్టించుకోవడం లేదు. ఎలాంటి స్పందన లేదు. పైగా ఇది ఒక పిచ్చివాడి పని అంటూ తేలికగా ప్రకటన చేస్తున్న ప్రభుత్వ తీరుకు,ఇస్లాం శక్తుల దాడులకు వ్యతిరేకంగా తెలంగాణ వ్యాప్తంగా హిందూ సంఘాలు నిన్న ప్రదర్శనలు బందులు నిర్వహించాయి.ఇది ఒక ఉగ్ర కోణమని,సమగ్ర విచారణకు ఆదేశించమని కోరుతూ న్యాయవాది శ్రీ ఇమ్మనేని రామారావు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసారు.విశ్వ హిందూ పరిషత్,భజరంగ్ దళ్ ఆద్వర్యంలో కోరుట్లలో పెద్ద ఎత్తున భారీ ప్రదర్శన నిర్వహించారు. తదనంతరం కోరుట్ల ఆర్డీవో కు వినతి పత్రం అందజేసారు.ఇట్టి కార్యక్రమంలో వి హెచ్ పి నాయకులు చెట్ పల్లి శంకర్, భజరంగ్ ధళ్ సభ్యులు వెంకటేశ్,రోహిత్,ఉదయ్ కుమార్ ,ధనుష్.. RSS నాయకులు గట్ల శివ.గంగుల రాజ్ కుమార్. బిజెపి నాయకులు మాడవేని నరేశ్, సుదవేని మహేశ్, బింగి వెంకటేశ్, చిరుమల్ల ధనుంజయ్ తో పాటు వివిధ హిందూ సంఘ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.



# అందుకే బాలీవుడ్‌పై ఆసక్తి కోల్పోయా

**ఇటీవల జరిగిన 70వ జాతీయ చలనచిత్ర అవార్డుల్లో ఉత్తమ నటిగా పురస్కారాన్ని అందుకొని అందరి దృష్టిని ఆకర్షించారు మానసి పరేఖ్. గుజరాతీ చిత్రం 'కచ్ ఎక్స్‌ప్రెస్'లో నటనకుగానూ మానసి ఈ అవార్డును అందుకున్నారు. ఐదో చిత్రానికే నేషనల్ అవార్డు రావడంతో ఆమె పేరు టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా మారింది. తాజాగా మానసి ఓ ఆంగ్ల పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో తన కెరీర్ ప్రారంభ రోజులను గుర్తుచేసుకున్నారు.**

'రోజూ ఉదయం 8 గంటలకు మూడు జతల డ్రెస్‌లు తీసుకొని ఇంటి నుంచి బయటకు వచ్చేదాన్ని. ఆడిషన్స్ జరిగే చోటు ఎంత దూరమైనా వెళ్లేదాన్ని. ఒక్కోసారి ఒక పాత్రకు 150 మంది లైన్‌లో ఉండేవారు. ఎంత కష్టమైనా ఆడిషన్స్ ఇచ్చే ఇంటికి వేళ్లేదాన్ని. పోరాటాలు, కష్టాలను ఎదుర్కొవాలని నిర్ణయించుకున్నాను. ఎందుకంటే మనం చేసే పోరాటాలే మనల్ని నిర్వచిస్తాయి. నేను అన్ని పోరాటాలు చేసి కష్టపడ్డాను కాబట్టే.. ఈ స్థాయిలో ఉన్నాను. కష్టాల తర్వాత వచ్చే విజయం మరింత మధురంగా ఉంటుంది. అప్పుడే ప్రతి క్షణాన్ని ఆస్వాదించగలుగుతాం. మనపై మనకు నమ్మకం ఉంటే ఏదైనా సాధించగలం' అని అన్నారు.ఇక 'ఉరి: ది సర్జికల్ స్ట్రయిక్' సినిమాలో విక్కీ కౌశల్‌కు సోదరిగా నటించిన తర్వాత అందరూ తనను సోదరి పాత్ర కోసమే సంప్రదించారని మానసి అన్నారు. అందుకే బాలీవుడ్‌పై ఆసక్తి కోల్పోయినట్లు తెలిపారు. "ఉరి' తర్వాత నేను కొన్ని సినిమాలకు నిర్మాతగానూ వ్యవహరించాను. అయినా.. బాలీవుడ్‌లో మాత్రం నాకు సోదరి పాత్రలే వచ్చాయి. నేను ఆ పాత్రకు మించి చేయగలనని ఎన్నో ఇంటర్వ్యూల్లో చెప్పాను. కానీ ఎవరూ పట్టించుకోలేదు. అందుకే బీటౌన్‌పై ఆసక్తి పోయింది. ఇప్పుడు నేను నిర్మాతను కాబట్టి గొప్ప పాత్రలను సృష్టించుకోగలను' అని చెప్పారు.ఇక 2003లో ఓ ఛానల్ నిర్వహించిన రియాలిటీ షోలో పాల్గొని, ఫైనలిస్టుల్లో ఒకరిగా మానసి నిలిచారు. ఆ తర్వాత బుల్లితెరపై గుర్తింపు తెచ్చుకొని 'కిత్నీ మస్త్ హై జిందగీ' సీరియల్‌తో నటిగా కెరీర్ ప్రారంభించారు. సీరియల్స్‌లో నటిస్తూనే హీరోయిన్‌గాను ఎంట్రీ ఇచ్చారు. 2012లో విడుదలైన 'లీలై'తో నటిగా పరిచయమయ్యారు. ఆ తర్వాత వరుస అవకాశాలతో ఆకట్టుకుంటున్నారు.



## సన్నీ దేవోల్ - గోపీచంద్ మలినేని మూవీ.. టైటిల్ ఏమిటంటే..?

బాలీవుడ్ నటుడు సన్నీ దేవోల్ ప్రధాన పాత్రలో తెలుగు దర్శకుడు గోపీచంద్ మలినేని ఓ సినిమా తెరకెక్కిస్తోన్న విషయం తెలిసిందే. మైత్రీ మూవీస్ మేకర్స్, పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ దీన్ని సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ప్రస్తుతం ఇది చిత్రీకరణ దశలో ఉంది. శనివారం సన్నీ దేవోల్ పుట్టినరోజు. ఈ సందర్భంగా చిత్రబృందం సినిమా టైటిల్, సన్నీదేవోల్ ఫస్ట్‌లుక్‌ను షేర్ చేసింది. మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపుదిద్దుకుంటోన్న ఈ చిత్రానికి 'జాట్' అనే టైటిల్ ఫైనల్ చేశారు. పాన్ ఇండియా స్థాయిలో ఇది విడుదల కానుంది. రెజీనాతో పాటు సయామీ ఖేర్ హీరోయిన్‌లుగా నటిస్తున్నారు. తమన్ సంగీతం అందిస్తున్నారు.

## మరో కొత్త కథలో?

'డీజే టిల్లు', 'టిల్లు స్క్వేర్' విజయాలతో సిద్ధు జొన్నలగడ్డ క్రేజ్ బాగా పెరిగింది. దీంతో ఆయనతో సినిమా చేసేందుకు కథలు సిద్ధం చేసుకుంటున్న దర్శకుల జాబితా రెట్టింపయ్యింది. సిద్ధు ప్రస్తుతం 'జాక్', 'తెలుసు కదా' చిత్రాలతో సెట్స్‌పై గడుపుతున్న సంగతి తెలిసిందే. ఇవి కాక 'కోహినూర్', 'టిల్లు క్యూబ్' సినిమాల్ని కూడా పూర్తి చేయాల్సి ఉంది. అయితే ఇప్పుడాయన వద్దకు మరో కొత్త ప్రాజెక్ట్ వచ్చినట్లు తెలుస్తోంది. 'గీత గోవిందం', 'సర్కారు వారి పాట' చిత్రాలతో సత్తా చాటారు దర్శకుడు పరశు రామ్. ఇప్పుడాయన సిద్ధుతో సినిమా చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే ఈ చిత్ర విషయమై చర్చలు జరిగినట్లు తెలిసింది. అన్నీ అనుకున్నట్లు జరిగితే దిల్‌రాజు బ్యానర్‌లో ఇది పట్టాలెక్కే అవకాశమున్నట్లు ప్రచారం జరుగుతోంది. మరికొద్ది రోజుల్లో దీనిపై స్పష్టత రానున్నట్లు తెలుస్తోంది.





## కేరళలో ముగించారు

విజయ్ దేవరకొండ కథానాయకుడిగా గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో ఓ చిత్రం రూపొందుతోంది. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మిస్తున్నారు. భాగ్యశ్రీ బోర్సే కథానాయిక. ముగింపు దశలో ఉన్న ఈ సినిమా చిత్రీకరణ కేరళలో జరుగుతున్న సంగతి తెలిసిందే. దాదాపు నెల రోజుల పాటు సాగిన ఈ షెడ్యూల్ ఇప్పుడు పూర్తయింది. ఈ షెడ్యూల్‌లో భాగంగా కొన్ని భారీ యాక్షన్ సీక్వెన్స్‌లతో పాటు కీలక సన్నివేశాలు చిత్రీకరించినట్లు తెలిసింది. దీనితో దాదాపు 90శాతానికి పైగా చిత్రీకరణ పూర్తయినట్లు తెలుస్తోంది. తదుపరి షెడ్యూల్ హైదరాబాద్, వైజాగ్‌లలో ప్లాన్ చేస్తున్నట్లు తెలిసింది. దీన్ని వచ్చే నెలలో ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.స్పై యాక్షన్ థ్రిల్లర్‌గా ముస్తాబవుతున్న ఈ సినిమాలో విజయ్ శక్తిమంతమైన పోలీసు పాత్రలో కనువిందు చేయనున్నారు. దీనికి అనిరుధ్ స్వరాలందిస్తున్నారు. ఇది వచ్చే ఏడాది ప్రేక్షకుల ముందుకు రానుంది.

## 'స్త్రీ 3'పై అప్‌డేట్ ఇచ్చిన శ్రద్ధాకపూర్.. ఏమన్నారంటే!



శ్రద్ధా కపూర్, రాజ్ కుమార్ రావు జంటగా నటించిన చిత్రం 'స్త్రీ 2' ఇటీవల విడుదలైన ఈ సినిమా మంచి విజయాన్ని సాధించింది. తాజాగా ఈ సక్సెస్‌పై శ్రద్ధాకపూర్ మాట్లాడారు. కథ వినగానే ఎంతో ఆశ్చర్యపోయానని అన్నారు. అందుకే వెంటనే ఓకే చేసినట్లు చెప్పారు. "స్త్రీ' చూసినప్పుడు ఇలాంటి సినిమా ఇప్పటి వరకు చూడలేదే అనిపించింది. దాని సీక్వెల్ కోసం నన్ను సంప్రదించగానే ఆశ్చర్యపోయా. ఇది చాలా మంచి వినోదాత్మక చిత్రం. మొదటి భాగానికి మించిన ఆదరణ 'స్త్రీ2' సినిమాకు లభించింది. దీన్ని ఇంత గొప్పగా తెరకెక్కించినందుకు దర్శక నిర్మాతకు హ్యాట్సాఫ్ చెప్పాలి. ఈ విజయం టీమ్ అందరికీ సొంతం. మంచి స్క్రిప్ట్‌తో వస్తే ప్రేక్షకులు ఎప్పుడూ ఆదరిస్తారని మరోసారి రుజువైంది. మూడో పార్ట్‌లో దీనికి మించిన ఎంటర్‌టైన్‌మెంట్ ఉంటుంది. దీని పనులు కూడా ప్రారంభమయ్యాయి. అందులో చాలా డెవలప్‌మెంట్‌లు చేశారు" అని చెప్పారు.2018లో శ్రద్ధాకపూర్, రాజ్‌కుమార్ రావు కాంబినేషన్‌లో వచ్చిన 'స్త్రీ'కి సీక్వెల్‌గా ఇది రూపొందింది. హారర్ కామెడీగా ఈ సినిమా ఈ ఏడాది ఆగస్టు 15న బాక్సాఫీసు ముందుకొచ్చింది. చందేరీ గ్రామంలో 'స్త్రీ' సమస్య తొలగిందని అందరూ ఊపిరి పీల్చుకునేలోగా 'సర్కట'తో కొత్త సమస్య మొదలవుతుంది. గ్రామంలో మోడ్రన్‌గా ఉండే అమ్మాయిలను ఇబ్బందులు పెడుతుంటాడు సర్కట. ఈ సమస్యను విక్కీ (రాజ్ కుమార్ రావ్), రుద్ర (పంకజ్ త్రిపాఠి), జన (అభిషేక్ బెనర్జీ), బిట్టు (అపర్ శక్తి )తో పాటు శ్రద్ధా కపూర్ ఎలా ఎదుర్కొంటారు? అన్న కథాంశంతో తెరకెక్కిన 'స్త్రీ 2' మంచి వినోదం పంచింది. దీంతో దీని మూడో పార్ట్ కోసం అభిమానులు ఎదురుచూస్తున్నారు.